నకిలీ జన్మ

శ్రీరాజ్

రివాల్వింగ్ చెయిర్‌లో అటునుంచి ఇటు, ఇటునుంచి అటు తిరుగుతూ, సీలింగ్ వైపు చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు ప్రఖ్యాత మనస్తత్వవేత్త ప్రొఫెసర్ హరనాథ్.

ఇంతలో కాలింగ్ బజర్ మ్రోగింది. తన ఆలోచనలకు స్వస్తిచెప్పి "యస్, కమిన్!" అన్నాడు చేతిలోని సిగరెట్టును ఆష్‌ట్రేలో పడేస్తూ.

స్ప్రింగు డోర్సు నెట్టుకొని ఒక నడివయస్కుడు, అతని వెనకాలే ఒక ఆడమనిషి వచ్చారు లోపలికి.

నడివయస్కుడు లోపలికి వస్తూనే ప్రొఫెసర్ హరనాథ్‌కి నమస్కరించాడు. ఆయన ప్రతినమస్కారం చేసి వారికి కుర్చీలు చూపించాడు.

వాళ్ళవంక పరీక్షగా చూసాడు ప్రొఫెసర్ వారనాథ్. వారిద్దరి ముఖాలలో విచారం దోబూచులాడుతున్నది.

"చెప్పండి. నానుంచి మీకు ఏం సహాయం కావాలి?"

నడి వయస్కుడు కళ్ళజోడు సవరించుకుని చెప్ప సాగాడు:

"నా పేరు గోపాలరావు. ఈమె నా భార్య సుశీల. మాది కొండపల్లి. మాకు ఒక్కడే కొడుకు ఉన్నాడు. పేరు రమేష్. ఇప్పుడు నేను చెప్పబోయేది నా కొడుకు రమేష్ గురించి" అని ఒక్క క్షణం ఆగాడు గోపాల రావు.

"మా వాడికి చిన్నప్పుడే, అంటే తొమ్మిదేళ్ళ వయసులో ఉన్నప్పుడు, మా యింటి ప్రక్కన ఉండే రాజీ అనే అమ్మాయితో స్నేహం ఏర్పడింది. ఆ పిల్లకు అప్పుడు ఆరేళ్ళు వయసు ఉండేది. రోజూ యిద్దరూ కలసి బడికి పోయేవారు. తిరిగి యిద్దరూ కలసి వచ్చేవారు. ఆ వయసులోనే వారు ఒకరిని విడిచి ఒకరు ఉండేవారుకారు. ఇరవై నాలుగు గంటలూ ఏదో ఒకటి చేసేవాళ్ళు యిద్దరూ కలిసి. అంటే ఆడుకోవడమో, చదువుకోవడమో యిటు వంటివి__"

చెప్పటం ఆపి "మొదట్నించి చెపితే మీకు కేసు బాగా అర్థమవుతుందని యిదంతా చెబుతున్నాను." అన్నాడు గోపాలరావు.

"ఫరవాలేదు చెప్పండి. అన్ని వివరాలు తెలిస్తే మాకు కూడ సులువుగా ఉంటుంది" అన్నాడు ప్రొఫెసర్ వారనాథ్.

తిరిగి చెప్పసాగాడు గోపాలరావు. "ఒక రోజు యిద్దరూ మామూలుగానే బడికి వెళ్ళారు. ఇంటర్వల్‌లో

మంచినీళ్లు త్రాగుదామని బడి ఆవరణలో వున్న బావి దగ్గరకు వెళ్ళారు. మా వాడు నీళ్ళు తోడతానంటే 'వద్దు. రోజూ నువ్వే తోడుతున్నావు. ఈ రోజు నేను తోడతాను' అని చెప్పి రాజీయే నీళ్ళు తోడటానికి సిద్ధమయింది. ఆ బావికి గిలక లేదు. వంగుని తోడాలి.

రాజీ నీళ్ళు తోడసాగింది. బకెట్టు బరువు ఎక్కువై నీళ్ళు తోడలేక చేతిలోని తాడును జారవిడచింది. ఆ జారుతున్న తాడుతోపాటు ఆ విసురుకి తాను కూడ వెళ్ళి బావిలో పడింది.

రాజీ బావిలో పడగానే పిల్లలందరూ పెద్దగా కేకలు పెడుతూ వచ్చి వాళ్ళ టీచరుకు చెప్పారు. ఆ టీచరు ముసలాయన. ఈత కూడ రాదు. బడి ప్రక్క వున్న ఇళ్ళలోని మనుష్యులను పిలిపించి, బావిలోకి దింపి, రాజీని బయటకు తీసారు.

కానీ ఆ చిన్నారి ప్రాణం అప్పటికే ఈ లోకాన్ని వదలిపోయింది.

ఆ రోజునుంచి మా వాడికి బాగా దిగులు పట్టుకుంది. రాజీ శాశ్వతంగా దూరం అయిందని తెలిసిన తరువాత అన్నం కూడ తినటం మానివేసాడు. ఆ రోజునుంచి బడికి వెళ్ళటం కూడ మానివేసి, దిగులుతో మంచం ఎక్కాడు. చాలామంది డాక్టర్ల దగ్గరకు తీసుకువెళ్ళాము. కాని వాడికి జబ్బు నయం కాలేదు.

కాలమే వాడిని బాగుచేయాలి అని ఇంటికి తీసుకొచ్చాము.

ఆ తరువాత ఒక సంవత్సరం అలాగే ఉన్నాడు. ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. అన్నం కూడ తనకు

యిష్టంవచ్చినప్పుడు, తినాలనిపించినప్పుడు వచ్చి తిని వెళ్ళేవాడు.

అటు తర్వాత రాజీని పూర్తిగా మరచిపోయాడు. పైకి మాత్రం బాగానే ఉన్నట్లు ఉండేవాడు. మళ్ళీ బడికి వెళ్ళటం, చదుకోవటం అన్నీ సక్రమంగానే జరగ సాగాయి.

అయితే, సరిగ్గా రాజీ చనిపోయిన పది సంవత్సరముల తర్వాత—ఒక రోజు హాఠాత్తుగా 'నాన్నా! నాకు రాజీ కనిపించింది' అన్నాడు. ఆ మాటకు నేను చాలా విస్తు బోయాను.

'అదేమిటిరా, రాజీ చచ్చిపోయి పది సంవత్సరాల పైన అవుతుంటే, ఇప్పుడు నీకు రాజీ కనిపించడమేమిటి, ఏదన్నా కలగన్నావేమో!' అని అన్నాను.

'కల కాదు నాన్నా! నిజంగా రాజీ నాకు కనపడింది. నాతో మాట్లాడింది కూడ. నాన్నా! రాజీ కూడ ఇప్పుడు నాలాగే పెద్దదయింది. అదీగాకుండా యిప్పుడు ఓణీలు వేసుకుంటున్నది' అన్నాడు వాడు సిగ్గు, సంతోషం మిళితంచేసి.

వాడికి ఏమని చెప్పాలో నాకు అర్థంకాలేదు. వాడు భ్రమపడుతున్నాడేమో అనుకొన్నాను. ఒక రోజున వాడు తన గదిలో కూర్చొని ఎవరితోనో మాట్లాడు తున్నాడు. వాడు మాట్లాడేది ఎవరితోనో కాదు, రాజీ తోనే. నేను వాడి గదిలోకి తొంగిచూసాను ఆశ్చ ర్యంగా. కాని అక్కడ నాకు ఎవ్వరూ కనబడలేదు. వాడు రాజీని ఉద్దేశించి మాట్లాడుతున్నాడు. వాడికి కన పడుతున్న రాజీ నాకు ఎందుకు కనిపించటంలేదు. నాకు వెంటనే ఒక అనుమానం వచ్చింది. రాజీకి యింకా ప్రా

వాడిమీద ప్రేమ నశించకుండా ఉండి దయ్యంగా మారి వాడితో మాట్లాడుతుందేమోనని —"

"ఎక్స్క్యూజ్ మి, మీలాంటి సైకాలజిస్టులకు దయ్యం అంటే నమ్మకముండదనుకొంటాను. నాకు కూడ దయ్యం 'ఉంది, లేదు' అని రూఢిగా తెలియదు. ఎటూ తేల్చుకో లేక చివరకు ఆ విధంగా అనుకున్నాను" అన్నాడు గోపాలరావు మధ్యలో చెప్పటం ఆపి.

"దానికేంగాని లెండి. ఎవరి నమ్మకాలు వాళ్ళవి. మీరు చెప్పేది చెప్పండి" అన్నాడు హరనాథ్ సిగరెట్టు వెలిగించుకుంటూ.

"— రాజీ దయ్యంగా మారిందనుకొని ఒక భూత వైద్యుడ్ని పిలిపించి సంప్రదించాను.

అతను ఏవో కొన్ని మంత్రాలు చదివి, కాస్త హంగామా చేసి చివరికి 'రాజీ దయ్యంగా మారిందని, ఇప్పుడు యుక్తవయసులో ఉన్న ఆ దయ్యానికి కామం ఎక్కువగా ఉంటుందని, ఆ దయ్యం యిప్పుడు మీ వాడితో సంభోగించాలని అనుకొంటున్నదని, అలా దయ్యంతో సంభోగం జరిపితే మీ రమేష్ ఒక్క సంవత్సరం కంటె ఎక్కువ బతకడని, అందుకని ఏమాత్రం ఆలస్యం చేయకుండా భూతవైద్యం మొదలుపెడితే మీ వాడిని ఆ దయ్యం వదలి వెళ్ళిపోతుందని' చెప్పాడు ఆ భూతవైద్యుడు.

అతను చెప్పింది విని మాకు చాలా భయంవేసింది. రాజీ దయ్యాన్ని పోగొడ్తానని చెప్పి మా చేత కొన్ని వేలు ఖర్చు పెట్టించాడు.

ఎంత డబ్బు ఖర్చుపెట్టినా మావాడు రాజీతో మాట్లాడటం మానలేదు.

చివరకు మాకు ఆ భూతవైద్యుడిమీద అపనమ్మకం ఏర్పడి, అతని వైద్యాన్ని మాన్పించాము.

అటు తర్వాత చాలామంది దగ్గరకు తీసుకెళ్ళాము. ఎంతమందికి చూపించినా, ఏమి చేసినా వాడుమటుకు రాజీతో మాట్లాడటం మానలేదు.

ఈ నెల రోజుల్లో వాడు సగం తగ్గిపోయాడు. ఇక ప్రతి రోజు అలాగే ఉంటే యిక మాకు దక్కడని పిస్తుంది.

అటువంటి సమయంలో నా చిన్ననాటి స్నేహితు డొకడు విజయవాడనుంచి వచ్చాడు. నా స్నేహితునికి ఈ సంగతంతా వివరించాను. అంతా విన్న తరువాత మీ గురించి చెప్పాడు. మీ దగ్గరకు వస్తే రమేష్ బాగుపడతా డని చెప్పాడు.

నా స్నేహితుడు ఈ మాట చెప్పగానే బయలుదేరి వచ్చాను.

మా వాడి గురించి యధార్థం మొత్తం మీకు చెప్పాను. ఎంత డబ్బు ఖర్చయినా సరే మీరు మళ్ళీ నా కొడుకుని మనిషిని చేయాలి. ఆ భారం అంతా మీ మీదనే పెడు తున్నాను.'' అన్నాడు గోపాలరావు జీరవోయిన గొంతుతో.

''మీరు ఏమి బాధపడకండి. ఈ కేసు బాగా స్టడీ చేసి, మీ వాడికి తప్పక నయంచేస్తాను. ఆ బాధ్యత నాది. మీ అడ్రసు యిచ్చి వెళ్ళండి. సరిగ్గా వారం రోజుల తర్వాత మీ యింటికి వస్తాను. వచ్చే ముందు ఉత్తరం వ్రాస్తాను. కాని ఒక్క మాట. నేను సైక్రియా టిస్టనని, నేను మీ వాడి గురించి అక్కడకు వచ్చానని తెలియకూడదు. ఒక చుట్టంలాగానో, లేక ఒక ఫ్రెండు

లాగానో నన్ను మీ వాడికి పరిచయం చేయండి'' అన్నాడు హరనాథ్.

''అలాగేనండీ! మీరు ఎంత త్వరగా వస్తే మాకు అంత రిలీఫ్ వస్తుంది'' అని కుర్చీలోంచి లేచాడు గోపాలరావు. అతని భార్య కూడ లేచి నమస్కరించింది.

ప్రొఫెసర్ హరనాథ్ దగ్గిర సెలవు తీసుకొని వెళ్ళిపోయారు గోపాలరావు దంపతులు.

2

గోపాలరావు దంపతులు వెళ్ళిపోయిన తరువాత ఆ కేసుకి సంబంధించిన కొన్ని పుస్తకాలను తీసి తిరగవేయసాగాడు ప్రొఫెసర్ హరనాథ్.

అంతలో అతని అసిస్టెంట్ కుమార్ వచ్చాడు.

''ఏం బాస్! ఏమిటి విశేషం? ఏదన్నా కేసు స్టడీ చేస్తున్నారా?'' అడిగాడు కుమార్ కుర్చీలో కూర్చుంటూ.

అప్పటిదాకా చదువుతున్న పుస్తకం మూసేసి కుమార్ వంక చూసి ''అవును. ఇందాకనే ఒక క్లయింట్ వచ్చి వెళ్ళాడు. అతను చెప్పిందంతా రికార్డ్ చేసాను. విని నీ అభిప్రాయం చెప్పు'' అని ప్రక్కనే వున్న టేప్ రికార్డర్‌ని 'ఆన్' చేసాడు హరనాథ్.

టేప్ రికార్డర్‌లోంచి వస్తున్న మాటలు పూర్తిగా విని, శూన్యంలోకి చూస్తూ, ఏదో ఆలోచించసాగాడు కుమార్.

''బాస్! నా కొక చిన్న అనుమానం.''

''ఏమిటది?''

''ఏం లేదూ! రమేష్‌కి చిన్నప్పటినుంచి దయ్యాలంటే నమ్మకమేమన్నా ఉందా?'' అడిగాడు కుమార్.

''ఎందుకు?'' ప్రశ్నించాడు హరనాథ్.

"అతనికి చిన్నప్పటినుంచే చనిపోయినవారు దయ్యా లయిపోతారని పెద్దవాళ్ళు అనుకొంటున్నప్పుడు విని, దయ్యాలున్నాయని భ్రమపడి, అతని రాజీ కూడ చని పోయి, దయ్యంగా మారి అతనితో బాటే పెరుగుతున్న దేమోనని వూహించుకొంటూండాలి. అదే నిజమయితే ముందు అతనికి దయ్యాలు లేవని, అదంతా మానవులు ఏర్పరచుకొన్న భ్రమ అని అతనికి తెలియపరచాలి. మనం గనక దయ్యాలు లేవని నిరూపిస్తే అతను బాగుపడినట్లే!" అన్నాడు కుమార్.

ప్రొఫెసర్ హరనాథ్ చిన్నగా నవ్వి, సిగరెట్టు వెలి గించుకొని గట్టిగా పొగ లోపలకు పీల్చి "నువ్వు ఊహించి నట్లు అతనికి నిజంగా దయ్యాలంటే నమ్మకముండి, రాజీ దయ్యం తనతోపాటే ఎదుగుతున్నట్లు వూహించుకొంటూ ఉంటే, నువ్వు చెప్పినట్లే అతనికి దయ్యాలు లేవని మనం నిరూపిస్తే అతను బాగుపడొచ్చు.

కాని ఆ తరువాత అతను నిజంగా పిచ్చివాడయి పోతాడు. ఇప్పుడు ఏదో కొద్దిగా భ్రమలో పడి బతుకు తున్నాడు. ఇక మనం ఆ భ్రమ కూడ పోగొట్టినట్లయితే, ఆ తరువాత అతను చావకుండా, బ్రతకకుండా రోజు రాజీ గుర్తుకి వచ్చి నరకం అనుభవిస్తాడు.

ఈ విధంగానే ట్రీట్‌మెంటు యిద్దామని ముందు నేను కూడ అనుకొన్నాను. కాని చివరలో అతని జీవితాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ట్రీట్‌మెంటుని వదిలేసాను. దీనిని గురించి యిందాకటినుంచి ఆలోచించి రమేష్‌ని వేరే పద్ధతిలో ట్రీట్ చేయదలచుకొన్నాను" అన్నాడు ప్రొఫెసర్ హరనాథ్ సిగరెట్టును మళ్ళీ పెదాల మధ్య యిరికించుకుంటూ.

"ఆ ట్రీట్‌మెంటు ఏదో నేను కూడ తెలుసుకో వచ్చా" అడిగాడు కుమార్ నవ్వుతూ.

"దానిని గురించి మొత్తం అయిడియా తీసుకొన్న తరువాత చెప్తాను. పద, ముందు భోజనం చేద్దాం" అని కుర్చీలోంచి లేచి, డైనింగ్ రూమ్ వైపు కదిలాడు ప్రొఫెసర్.

3

ఉదయం తొమ్మిది గంటల సమయం—

గోపాలరావు వరండాలో కూర్చొని హరనాథ్ కోసం ఎదురుచూస్తున్నాడు. రెండు రోజుల క్రితమే హరనాథ్ నుంచి ఉత్తరం వచ్చింది. దానిలో హరనాథ్ వ్రాసిన ప్రకారం తను అన్ని ఏర్పాట్లు చేసాడు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకల్లా వస్తానని వ్రాసాడు. ఈ రోజు ఆదివారం.

గడియారం వంక చూసుకొన్నాడు. తొమ్మిది అవ టానికి యింకా అయిదు నిమిషాల వ్యవధి ఉన్నది.

గోపాలరావు కొడుకు రమేష్ అంతకుముందే బయటకు వెళ్ళాడు. అతను మళ్ళీ తిరిగి వచ్చేసరికి ఒక గంట పడుతుంది.

గోపాలరావు మనసు గజిబిజిగా తయారయింది. అంతలో గేటు దగ్గిర కారు హారన్ వినిపించింది. టాక్సీ ఒకటి లోపలకు వస్తున్నది. గోపాలరావు ఆలోచనలకు స్వస్తి చెప్పి, కారులోంచి దిగుతున్న ప్రొఫెసర్ హర నాథ్‌కి ఎదురు వెళ్ళాడు.

"రండి. సరిగ్గా ఉత్తరంలో వ్రాసిన ప్రకారం వచ్చే శారు. మీ కోసమే ఎదురుచూస్తున్నాను" అన్నాడు గోపాలరావు.

చిరునవ్వుతో కారులోంచి దిగి గోపాలరావు వెంట నడిచాడు. గోపాలరావు నౌకరు డిక్కీలోని సామాను తీసుకొని మేడపైకి వెళ్ళాడు.

"మీకు మేడమీద రమేష్ గది ప్రక్కనే వున్న గది కేటాయించాము." అని చెప్పి హరనాథ్‌ని ఆ గదిలోకి తీసుకెళ్ళాడు.

సామానంతా ఒక ప్రక్కన పెట్టి వెళ్ళిపోయాడు నౌకరు.

"మీరు డ్రస్ ఛేంజ్ చేసుకొంటూ ఉండండి. నేను క్రిందకు వెళ్ళి కాఫీ పంపిస్తాను." అని బయటకు వచ్చేశాడు గోపాలరావు.

ప్రొఫెసర్ హరనాథ్ ఒకసారి గదినంతా పరికించి తృప్తిగా నిట్టూర్చి, బెడ్డింగ్ ఓపెన్ చేసి, బట్టలు మార్చుకోడానికి ఉపక్రమించాడు.

నౌకరు కాఫీ తీసుకువచ్చి 'టీపాయ్'మీద పెట్టి వెళ్ళిపోయాడు.

అంతలో ప్రక్క గదిలోంచి మాటలు వినరాసాగాయి.

4

"సారీ! రాజీ, లేటయింది. అసలు నేను తొందరగానే వద్దామనుకొని వస్తుంటే దారిలో నా ఫ్రెండొకడు తగిలాడు. వాడిని వదిలించుకొని వచ్చేటప్పటికి ఈ సమయం అయింది. అన్నట్టు నీకు తెలుసా? ఈ రోజు మా ప్రొఫెసర్ బాబాయి ఫారిన్నుంచి వస్తున్నాట్ట...

ఆయన గురించి నీకు తెలియదు కదూ! నిన్నటి దాకా నాకు కూడ తెలియదు! నిన్ననే నాకు కూడ మా నాన్నగారు చెప్పారు...

మా ప్రొఫెసర్ బాబాయి చిన్నప్పుడే ఇంట్లోంచి పారిపోయి మద్రాసు వెళ్ళి కొన్నాళ్ళు అక్కడ స్థిరపడి అక్కడ బాగా చదువుకొని, అక్కడనుంచి ఫారిన్ వెళ్ళి, అక్కడ ఏవో పరిశోధనలు జరిపి బాగా పేరు తెచ్చుకొన్నాట్ట...

ఈమధ్య క్రొత్తగా ఒక పరిశోధన మొదలుపెట్టాడట. ఏమిటంటే చచ్చిపోయినవారిమీద పరిశోధనలు జరుపుతున్నాట్ట. ఆయన రాగానే నీ గురించి చెప్పి నిన్నుకూడ నాలాగే అందరికి కనిపించేటట్లు చేయమని చెప్తాను. ఆ తరువాత మనిద్దరం పెళ్ళిచేసుకొని, కొన్ని రోజులు హాయిగా హనీమూన్‌కి వెళ్ళి సరదాగా గడిపివద్దాం...

అప్పుడు యిక మనల్ని ఏమి అనలేరు. అప్పుడు ఎవరన్నా నాకు పిచ్చి అన్నారంటే చంపిపారేస్తాను...

నిజం రాజీ, మా ప్రొఫెసర్ బాబాయి చాలా గొప్పవాడని మా నాన్న చెప్పాడు. నా మాట అబద్ధమయితే, మా బాబాయి వచ్చిన తరువాత చూపిస్తాను. అప్పుడయినా నమ్ముతావు—" కాసేపు నిశ్శబ్దం.

రమేష్ మాటలాడే తీరునిబట్టి అతన్ని, అతని పరిస్థితిని ఊహించుకోసాగాడు హరనాథ్.

మళ్ళీ మాటలు వినిపించసాగాయి.

"—రాజీ, నువ్వు భోంచేశావా! ఆఁ!...ఇంకా భోజనం చేయలేదా! ఎందుకింతసేపు వుంటావు! అన్నం తినకుండా. ఏమిటీ, నాకోసం కూర్చున్నావా! మతిలేకపోతే సరి, బయటకు వెళ్ళిన మగవాళ్లు ఎప్పుడు వస్తారో వాళ్ళకే తెలియదు. ఇలాగ యింకెప్పుడు చేయవద్దు. తెలిసిందా! ఇకనుంచి సరిగ్గా పది గంటలు అయ్యేసరికి నువ్వు అన్నం తినేసేయాలి. లేకపోతే నేను చాలా బాధపడాల్సి

వస్తుంది. ఉండు, అమ్మని పిలిచి అన్నం యిక్కడికే తెమ్మని చెప్తాను.'' అని గది బయటకు వచ్చి—

''అమ్మా! అమ్మా! నీకన్నిసార్లు చెప్పాలి. రోజూ పది గంటలయేసరికల్లా రాజీకి అన్నం పెట్టాలని. ఛీ, ఛీ, ఒక్కళ్ళకూ మతిలేదు. పెద్దవాళ్ళయ్యారు. ఎందుకు? ఆమాత్రం తెలుసుకోనక్కరలేదా! మీకు తెలియకపోతే ఒక ప్రక్కనుంచి నేను చెపుతున్నాను గదా!'' పెద్దగా ఇల్లు ఎగిరిపోయేలా అరుస్తున్నాడు రమేష్.

కిటికీ వున్న కర్టెన్ తొలగించి బయట వరండాలోకి చూసాడు హరనాథ్. రమేష్ తల్లి అన్నం కంచంతో రమేష్ గదిలోకి వెళ్తున్నది.

''అక్కడ పెట్టి వెళ్లు. మళ్ళీ నేను పిలిచిం తరువాత రా!'' వినిపించింది రమేష్ గొంతు.

''రాజీ, దా. ఇవాళ నేను ముద్దలుచేసి పెడతా'' బ్రతిమిలాడుతున్నట్లుగా మాట్లాడుతున్నాడు రమేష్.

ఇక తను పరోక్షంగా రమేష్ పరిస్థితిని అర్థం చేసుకోవాలంటే కుదరదు. అతని చర్యలను స్వయంగా గమనించాలని తలచి, కళ్ళజోడు ఒకసారి సవరించుకొని, తలుపు తెరచుకొని బయటకు వచ్చాడు ప్రొఫెసర్ హరనాథ్. అప్పుడే గోపాలరావు మేడమీదకు రావడం చూసి అక్కడే నిలబడ్డాడు హరనాథ్.

గోపాలరావు హరనాథ్ దగ్గరకు వచ్చి ''ఇప్పటిదాకా జరిగిన తతంగం విన్నారుగా! రండి, అబ్బాయికి పరిచయం చేస్తాను.'' అని రమేష్ గదిలోకి దారితీసాడు.

''బాబూ! రమేష్!'' పిలిచారు గోపాలరావుగారు.

''ఇప్పుడు ఎవరూ కూడ నన్ను పలకరించవద్దు. నా

రాజీకి అన్నం తినిపిస్తున్నా." అన్నాడు రమేష్ వెనక్కి తిరగకుండానే.

కంచంలోని అన్నం మెతుకులు చెల్లాచెదురుగా నేల మీద పడివున్నాయి. రమేష్ చేతిలో చిన్న ముద్ద వున్నది. ఆ చేతిని శూన్యంలోకి ఎత్తిపెట్టి, "అయిపోయిందిలే, ఈ ఒక్క ముద్ద తిను. తరువాత చేయి కడిగేస్తాను." అంటూ అన్నం ముద్దను అలాగే శూన్యంలోకి వదిలేసాడు.

"ఆగు! అప్పుడే లేస్తావేమిటి? చేయి, మూతి కడుగుతా నుండు." అని ఎడమచేత్తో నీళ్ళ గ్లాసు పట్టుకొని, కుడి చేతిలోకి నీళ్ళు వంపుకొని, ఆ చేతిని శూన్యంలో ఆడించ సాగాడు.

"ఇక వెళ్ళి పడుకో, నాకోసం నాన్నగారు వచ్చారు. ఆయనతో మాట్లాడిన తరువాత నేను కూడ వస్తాను." అని తనకు కనపడుతున్న రాజీకి చెప్పి తను కూర్చున్న చోటునుంచి లేచి గోపాలరావువైపు తిరిగాడు.

"నాన్నా! ఎవరీయన?" అడిగాడు తండ్రిని, ఆయన ప్రక్కన వున్న హరనాథ్‌ను చూస్తూ.

"మొన్న చెప్పాను గద బాబూ! మీ బాబాయి ఫారిన్ నుంచి వస్తున్నాడని. ఆయనే ఈయన." చెప్పారు గోపాలరావుగారు.

"ఓహో! మీరేనా ప్రొఫెసర్ బాబాయి!" అని నమస్కరించాడు రమేష్.

"మళ్ళీ వస్తాను." అని చెప్పి వెళ్ళిపోయారు గోపాల రావుగారు, హరనాథ్ చేసిన సైగనందుకొని.

5

"రమేష్ కదూ నీ పేరు?" అడిగాడు ప్రొఫెసర్ హరనాథ్.

"అవునండి."

"నేను చిన్నప్పుడే యింటినుంచి వెళ్ళిపోవడంవలన అన్నయ్యవాళ్ళ సంగతులు ఏమి తెలుసుకోవటానికి వీలు లేకపోయింది. మొన్న పేపర్లో నా ఫోటో పడినప్పుడు ఆ ఉత్తరం అన్నయ్య గుర్తుపట్టి, అంటే మీ నాన్న నాకు ఉత్తరం వ్రాశాడు. చూసేదాకా మీరు ఎక్కడున్నారో తెలియలేదు. మీ నాన్న వ్రాసిన ఉత్తరం చూడగానే ఒక్కసారి వచ్చి మిమ్మల్నందరినీ చూడాలనిపించింది. వెంటనే బయలుదేరి వచ్చాను. అది సరే, ఇంతకుముందు నువ్వు ఎవరితోనో మాట్లాడుతూ అన్నం తినిపిస్తున్నావు. ఎవరికి?" అడిగాడు హరనాథ్.

"మీకు తెలియదు గదూ! నేను మాట్లాడుతున్నది నా రాజీతో."

"రాజీనా! ఎక్కడుంది? నాకు కనిపించలేదే?" ఆశ్చర్యం నటిస్తూ అడిగాడు హరనాథ్.

"నా రాజీ అందరికీ కనపడదు. నా ఒక్కడికి తప్ప."

"ఏం, నీ రాజీ దేవతా ఏమిటి? అందరికీ కనిపించక పోవడానికి?"

"అవును. నా రాజీ చిన్నప్పుడే చనిపోయి దేవతగా మారింది."

ఒక్కసారి పెద్దగా నవ్వాడు ప్రొఫెసర్ హరనాథ్.

"ఎందుకు? నవ్వుతున్నారు." అడిగాడు రమేష్కి అర్థంగాక.

"చచ్చిపోయినవాళ్ళు దేవతలవుతారని ఎవరు చెప్పారు నీకు?"

"బ్రతికి వున్నప్పుడు మంచిపనులు చేసినవాళ్ళు దేవతలుగాను, చెడుపనులు చేసినవాళ్ళు దయ్యాలుగాను మారు

తారని చిన్నప్పుడు మా మాష్టారు చెప్పారు." అన్నాడు రమేష్ హారనాథ్ వంక వింతగా చూస్తూ.

"శుద్ధ అబద్ధం! చచ్చిపోయినవాళ్ళు దేవతలుగాను, దయ్యాలుగాను మారిపోతే, ఈ భూమ్మీద ఎక్కడ చూసినా దయ్యాలు, దేవతలే కనిపిస్తారు." హేళనగా అన్నాడు హారనాథ్.

"మరి మా మాష్టారు మాకెందుకు అలా చెప్పాడు అయితే?"

"ఆయనకు యింకెవరో చెప్పుంటారు యిలాగే. అది మీకు చెప్పాడు అంతే."

"బాబాయ్! మరి చచ్చిపోయినవాళ్ళంతా ఏమవుతారు?" అనుమానంగా అడిగాడు రమేష్, హారనాథ్ వంక చూస్తూ.

"చెప్పమంటావా? మరి చెపితే నా మాట నమ్ముతావా?"

"చెప్పండి, మీ మాట నమ్ముతాను."

"చచ్చిపోయినవాళ్లు కొన్ని రోజుల తరువాత ఇంకో చోట ఎక్కడన్నా పుడతారు. అంటే మనిషిగా పుడతారని కాదు. కొంతమంది మనిషిగా పుడతారు. కొంత మంది జంతువులుగాను, మరికొంతమంది పక్షులుగాను పుడతారు." చెప్పాడు హారనాథ్ రమేష్ కళ్ళలోకి సూటిగా చూస్తూ.

కాసేపు మౌనం వహించాడు రమేష్ ఏదో ఆలోచిస్తూ. కొద్ది క్షణాలు గడచిన తరువాత "బాబాయ్! మరి నా రాజీ చచ్చిపోయినా కూడ నాకు కనిపిస్తుందిగా దానిని ఏమంటారు?"

"అది నీ భ్రమ అంటాను. చచ్చిపోయిన తరువాత కూడ నీ రాజీమీద నీకు ప్రేమ నశింపక, నువ్వు ఏదో ఊహించుకుంటూ భ్రమలోపడి, 'నా రాజీ నాకు కనిపిస్తుంది' అని పిచ్చివాడిలా తయారవుతున్నావు."

అప్పటిదాకా లోకులందరూ రమేష్‌ని పిచ్చివాడంటే కోపగించుకునేవాడు. కాని ఈ రోజున రమేష్‌కే అనుమానం రాసాగింది. 'నిజంగా నేను పిచ్చివాడినేమో' అనుకొన్నాడు మనస్సులో.

"బాబాయ్! మీరు ఫారిన్‌లో చనిపోయినవాళ్ళమీద రీసెర్చి చేస్తున్నారని నాన్న చెప్పాడు నాకు. అసలు మీరు చచ్చిపోయినవాళ్ళమీద రీసెర్చి ఎందుకు చేస్తున్నారు? ఎట్లా చేస్తున్నారు?" అర్థంగాక అడిగాడు రమేష్.

"అది నీకు చెప్పినా అర్థంకాదు. అయినా నీకు దానితో పని ఏమిటి?"

"అదికాదు బాబాయ్! మీరు నా రాజీమీద కూడ రీసెర్చి చేసి, చచ్చిపోయిన నా రాజీ మళ్ళీ ఎక్కడ పుట్టిందో చెప్పితే, వెళ్ళి తెచ్చుకుంటాను."

"చూడు రమేష్, నీ రాజీ చచ్చిపోయిన తరువాత మళ్ళీ మనిషిగా పుడుతుందని గ్యారంటీలేదు. ఒకవేళ నీ రాజీ ఎక్కడ పుట్టిందో తెలుసుకొన్నాననుకో. నా రీసెర్చిలో నీ రాజీ ఏ జంతువుగానో, ఏ పక్షిగానో పుట్టివుంటే నువ్వు ఇంకా బాధపడతావు. మనిషిగా పుట్టివుంటే అది నీ అదృష్టం. అయినా నా కర్తవ్యం నేను చేస్తాను. నీ అదృష్టం బాగుండి, నా శ్రమ ఫలించి, చచ్చిపోయిన నీ రాజీ ఈ జన్మలో కూడ మనిషిగా పుట్టి, అందులో ఆడపిల్లగా పుట్టివుంటే నిజంగా నువ్వూ, నేనూ

యిద్దరం అదృష్టవంతులమే. నీ తృప్తికోసం నేను రేపు రాత్రికి రాజీ ఆత్మను నా అధీనంలోకి తెచ్చుకొని రాజీ ఆత్మతో మాట్లాడి, రాజీ ఎక్కడ పుట్టిందో, ఏమిటో వివరాలన్నీ తెలుసుకొని, ఎల్లుండి నీకు చెపుతాను. అందాకా నువ్వు ఎలాంటి గొడవా చేయకుండా, బుద్ధిగా వుంటానని మాట యిస్తే తప్ప నేను ఈ పనికి పూనుకోను.'' అన్నాడు హరనాథ్, రమేష్ ముఖకవళికలు పరీక్షగా చూస్తూ.

ఒక్క నిమిషం శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచించసాగాడు.

''సరే బాబాయ్! నేను ఎటువంటి గొడవా చేయకుండా మీరు చెప్పినట్లే చేస్తాను. మీరుమటుకు నా రాజీ ఈ జన్మలో ఎక్కడ పుట్టిందో, ఏ విధంగా పుట్టిందో తెలుసుకుని పది రోజులలోపు రాజీ ఏ రూపంలో పుట్టినా నా దగ్గరకు తీసుకువచ్చి, మీరు తీసుకొచ్చినది నా రాజీయే అని రుజువుచేయాలి.'' అన్నాడు రమేష్.

''సరే, నువ్వు చెప్పినట్లే పది రోజులలోపు నీ రాజీని ఏ రూపంలో వున్నా తీసుకువస్తాను. కాని నాకు కొన్ని సందేహాలున్నాయి. నేనడిగినవాటికి నువ్వు సరిగా జవాబు చెప్పాలి.'' అన్నాడు హరనాథ్.

''అలాగే.'' అని తల వూపాడు రమేష్.

''నీ రాజీ ఎన్ని సంవత్సరాల వయసప్పుడు చచ్చిపోయింది?''

ఒక్క క్షణం ఆలోచించి, ''ఆరు సంవత్సరాల వయసప్పుడు.'' అన్నాడు.

''అంటే యిప్పటికి ఎన్నేళ్ళయింది చచ్చిపోయి?''

"నాకు తొమ్మిదేండ్ల వయసున్నప్పుడు చచ్చిపోయింది. ఇప్పుడు నాకు ఇరవైఅయిదు సంవత్సరాలు. అంటే రాజీ చచ్చిపోయి యిప్పటికి పదహారు సంవత్సరాలు." అన్నాడు రమేష్.

"ఇక పోతే నీ రాజీ గురించి కొన్ని వివరాలు, అంటే ఆ అమ్మాయి ఎలా వుంటుంది? ఆమె అలవాట్లు కొన్ని చెప్పు." అన్నాడు హరనాథ్ జేబులోంచి డైరీ తీస్తూ.

రమేష్ తనకు గుర్తున్న కొన్ని అలవాట్లను చెప్పి, ఆమెను వర్ణించాడు. రమేష్ చెప్పినవన్నీ తన డైరీలో వ్రాసుకొన్నాడు హరనాథ్.

"సరే, నేను చెప్పినవన్నీ గుర్తుంచుకొని జాగ్రత్తగా వుండు. పది రోజుల్లో నీ రాజీని తీసుకువచ్చి నీకు అప్పజెప్పే బాధ్యత నాది." అని చెప్పి లేచి బయటకు నడిచాడు.

6

"ఏం బావా! ఎవరో ప్రొఫెసర్ వచ్చాడట మనింటికి. నీకు తమ్ముడు కూడ అవుతాడట గదా! ఎలా వచ్చిందీ చుట్టరికం? ఇంతకీ అతను వచ్చింది అబ్బాయి పిచ్చి నయం చేయడానికా? లేక మిమ్మల్ని చూసిపోవడానికా?" లోపలకు వస్తూనే ప్రశ్నల వర్షం కురిపించాడు పరంధామయ్య.

పరంధామయ్య గోపాలరావుకి బావమరది అవుతాడు. పరంధామయ్యకు ఒక్కతే కూతురు. పేరు లలిత. ముద్దుగా లిల్లీ అని పిలుచుకొంటాడు. పరంధామయ్య ఎప్పట్నించో లిల్లీకి, రమేష్‌కి పెళ్ళి చేయాలనుకొంటున్నాడు.

రమేష్‌కి పిచ్చి అని తెలిసి కూడ తన కూతురును రమేష్‌కి యివ్వడానికి సిద్ధపడ్డాడంటే, రమేష్‌పై ప్రేమ

వుండి కాదు, అతని ఆ స్తిమీద ప్రేమ వుండి ఈ పెళ్ళి చేయ నిశ్చయించుకొన్నాడు.

అందుకనే పరంధామయ్య వారానికి ఒక్కసారయినా వచ్చి రమేష్‌ని తన అల్లుడిగా చేసుకొంటాననని గోపాలరావుని అడగటం, గోపాలరావు వద్దనటం ఎన్ని సంవత్సరాలుగానో జరుగుతూంది.

అయినా పరంధామయ్య పట్టువదలని విక్రమార్కుడిలా తన ప్రయత్నం తను సాగిస్తూనే వున్నాడు.

"పిచ్చివాడిని అల్లుడుగా చేసుకోవడానికి ఏ తల మాసినవాడుగాని, ఎంత బుద్ధితక్కువ వెధవగాని ఒప్పుకోడు. నువ్వు ఏదో తోడబుట్టిన చెల్లెలి మొగుడువని అభిమానంతో నీ మంచి, రమేష్ బాగు కోరి నేను వాడిని అల్లుణ్ణి చేసుకొంటాననంటే వద్దంటున్నావు. అవున్లే కావాలనుకొని పదిసార్లు నీ చుట్టూ తిరగడంవలన నీకు అలుసు అయిపోయాను. నేనే గనక కూతురుకి బయట సంబంధం చేయదలచుకుంటే వందలమంది వరాళ్ళు 'క్యూ'లో నిలబడతారు వచ్చి." అని అక్కసుగా అనిపోతాడు పరంధామయ్య ప్రతిసారి.

పరంధామయ్యకు నిజానికి బయట సంబంధం చేయడం యిష్టంలేదు. నిజంగా తనే గనక లిల్లీకి బయట సంబంధం చేస్తే యిక్కడ రమేష్ లక్షల ఆస్తి జారిపోతుందని తలచి తడవతడవకు వచ్చి గోపాలరావుచేత వద్దనిపించుకు పోతున్నాడు.

కాని ఈసారి అలా వద్దనిపించుకోకుండా పోవాలని పట్టుదలమీద వచ్చాడు. దానికి ప్లాను కూడ ఆలోచించుకు వచ్చాడు.

"బావా! ఈమధ్య అమ్మాయికి రెండు రోజులనుంచి వంట్లో బాగుండటంలేదు. వంట చేయటానికి కూడ వంట్లో ఓపికలేదు. వంటమనిషిని పెట్టుకుంటే అది సరిగ్గా చేసి ఏడవదు. అందుకని నువ్వు ఏమీ అనుకోకుండావుంటే, అమ్మాయికి వంట్లో బాగుఅయేదాకా మేము యిద్దరం యిక్కడే వుంటాము." అన్నాడు పరంధామయ్య గోపాలరావు ఏం చెపుతాడాని ఆలోచిస్తూ.

"పిచ్చివేషాలు వేయకుండా బుధిగా వుంటానంటే నాకేమీ అభ్యంతరంలేదు." అన్నాడు గోపాలరావు.

7

అప్పుడే నౌకరు తెచ్చిన కాఫీ త్రాగి, సిగరెట్టు వెలిగించుకొన్నాడు ప్రొఫెసర్ హరనాథ్.

అంతలో గోపాలరావు వచ్చాడు గదిలోకి.

"కాఫీ తాగారా?" అడిగాడు గోపాలరావు లోపలకు వస్తూనే.

"ఆఁ! ఇప్పుడే తీసుకొన్నాను. టైము అయిదు కావచ్చింది. మనం బయలుదేరుదామా! ప్రొద్దున అనుకొన్న చోటికి." అన్నాడు ప్రొఫెసర్ సిగరెట్టు పొగను గాలిలోకి వదులుతూ.

"ఒక పావుగంట తరువాత బయలుదేరుదాము. ఈలోపల మీతో రెండు మాటలు చెప్పాలి."

"చెప్పండి." అన్నాను హరనాథ్.

"ఏం లేదు, ఈ వూళ్ళోనే నా బావమరిది ఒకడున్నాడు. అతని ఆలోచనలు, బుద్ధులు కాస్త వక్రమార్గంలో ప్రయాణిస్తాయి. అతనికి ఒక్కతే కూతురు ఉన్నది. ఎప్పటినించో ఆ కూతురును మా రమేష్‌కిచ్చి పెళ్ళిచేయాలని ఆలోచన. చాలాసార్లు నన్ను అడిగి నాచేత కాదని

పించుకొన్నాడు. అయినా అతను రమేష్ అందాన్ని, మంచితనాన్ని చూసి కాదు ఈ పెళ్ళిచేసేది, రమేష్ వెనకనున్న ఆస్తిని చూసి. అయినా నేను రమేష్‌కు ఈ పిచ్చి కుదిరేదాకా పెళ్ళి చేయదలచుకోలేదు అప్పట్లో.

అతను ఈ రోజు తన కూతురుకి వంట్లో బాగోలేదు, వంట చేసుకోవటం కూడ చాల కష్టంగా వుందని - అందుకని కూతురుకు బాగయ్యేదాకా యిక్కడే వుంటానని వచ్చాడు కూతురితో సహా.

అతను యిక్కడకు వచ్చాడంటే వూరికే రాడు, ఏదో ప్లాను వేసుకొని వచ్చాడని నా అనుమానం. అతను యిక్కడ వుండటంవలన మీకేమన్నా ఆటంకం వుంటుందేమోనని భయంగా వున్నది. అతన్ని యిక్కడ వుండొద్దని చెపితే నా భార్య బాధపడుతుంది. అందుకని తప్పనిసరై వుండమనాల్సివచ్చింది." అని ముగించాడు గోపాలరావు.

"ఏం పరవాలేదు. అతనివల్ల నాకేమీ ఆటంకం లేదు. ఒకవేళ ఏదన్నా ఆటంకం వచ్చినా నేను సర్దుకోగలను. నా యీ వృత్తిలో యిటువంటివి అనుభవమే. ముందు జాగ్రత్తకోసం ఈ రోజునే నా అసిస్టెంటుకి టెలిగ్రాం యిస్తాను, ఇక్కడకు రమ్మని." అన్నాడు ప్రొఫెసర్.

"ఇక పోదామా?" అడిగాడు గోపాలరావు.

"అలాగే." అని చెప్పి, లేచి డ్రెస్ చేసుకొన్నాడు ప్రొఫెసర్ హరనాథ్.

డ్రెస్ చేసుకోవటం పూర్తిఅయిన తరువాత క్రిందకు వచ్చారు ఇద్దరూ.

"డ్రైవర్‌ని పిలవనా! లేక మనిద్దరమే పోదామా?" అన్నాడు గోపాలరావు కారువైపు నడుస్తూ.

"డ్రైవర్ అనవసరం. మీకు డ్రైవ్ చేయటం అలవాటున్నట్లయితే మీరు నడపండి. లేకపోతే నేను డ్రైవ్ చేస్తాను." అన్నాడు ప్రొఫెసర్.

గోపాలరావు ఫ్రంట్ డోర్ తీసి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. రెండో వైపునుంచి ప్రొఫెసర్ హరనాథ్ కూర్చున్నాడు.

గేటుదాక మెల్లిగా నడచి, అక్కడనుంచి మలుపు తిరిగి, వేగాన్ని పుంజుకుంది కారు.

8

అప్పటికి ప్రొఫెసర్ హరనాథ్ వచ్చి మూడురోజులు అయింది.

ఉదయం తొమ్మిది గంటల సమయం—

హరనాథ్, రమేష్ గదిలోకి అడుగుపెడుతూ, "ఏం, రమేష్! ఎట్లా వున్నావు? ఇంకా రాజీని గూర్చి తపస్సు చేస్తున్నావా?" అన్నాడు నవ్వుతూ.

"ఏం చేసేది బాబాయ్! మీరేమో నా రాజీ మళ్ళీ ఎక్కడో పుట్టిందని చెప్పారు. మీరు చెప్పింది నిజమైతే త్వరగా నా రాజీని నాకు కనపడేటట్లు చేయండి." అన్నాడు రమేష్ దిగాలుగా.

"రమేష్! నువ్వు తొందరపడవద్దు. ఒక్క వారం రోజులు రాజీని గురించి ఆలోచించటం మానెయ్యి. నేను నిన్న రాత్రే రాజీ ఆత్మను పిలిచి, నా అధీనంలో వుంచుకొని మాట్లాడాను కాసేపు—"

"రాజీ ఆత్మతో మాట్లాడారా? నన్ను కూడ పిలిచి వుంటే నేనూ వచ్చి మాట్లాడేవాడిని గదా! నన్నెందుకు పిలవలేదు?" మధ్యలో అందుకొని మాట్లాడసాగాడు రమేష్.

"రమేష్! చచ్చిపోయినవారి ఆత్మలతో మాట్లాడా లంటే అందరికీ సాధ్యమయ్యే పనికాదు. అదొక బ్రహ్మ విద్య. ఆ విద్య నభ్యసించడానికి నేను నా వయస్సులో సగభాగం ఖర్చుచేసాను. ఎన్నో సంవత్సరాలు కష్టపడి చనిపోయినవారి ఆత్మలతో మాట్లాడటం నేర్చుకొన్నాను. ఆ సమయంలో ఎవరన్నా ప్రక్కన వున్నట్లయితే ఏకాగ్ర తకు భంగం కలిగి మనకు కావాల్సిన ఆత్మ దొరక్కుండా పోతుంది, అప్పుడప్పుడు నీ రాజీ ఆత్మతో మాట్లాడే అవ కాశం అసలు వుండదు," అని చెప్పాడు హరనాథ్.

"అయితే ఇంతకీ మీరు రాజీతో ఏం మాట్లాడారు?" అడిగాడు రమేష్ ఆతృతగా.

"రమేష్! నిజంగా అదృష్టవంతుడివే! ఈ జన్మలో కూడా రాజీ మనిషిగాను, అందులో ఆడపిల్లగానే పుట్టింది. ఇక్కడకు వందమైళ్ళ దూరంలో వున్న అద్దంకి అనే వూర్లో నారాయణరావు, జానకమ్మ అనే దంపతులకు జన్మించిందట. ఈ జన్మలో కూడా తన పేరు రాజేశ్వరే నట. అందరూ 'రాజీ' అని పిలుస్తారట." అని టూకీగా చెప్పాడు హరనాథ్.

హరనాథ్ చెప్పిన మాటలు విని ఆనందంతో, "బాబాయ్! అయితే త్వరగా నా రాజీని నా దగ్గరకు తీసుకురండి. నేను చూడాలి. ప్లీజ్! త్వరగా వెళ్ళి తీసుకు రండి." తొందర చేయసాగాడు.

"రమేష్! నేను చెప్పేది విను. ఇప్పుడు ఆ రాజీకి వేరే తల్లిదండ్రులున్నారు. మనం వాళ్ళ దగ్గరకు వెళ్ళి 'మీ అమ్మాయి పూర్వజన్మలో మా అబ్బాయికి స్నేహితురాలు. వాళ్ళు చిన్నప్పట్నించి ఒకటిగా కలసి తిరిగారు. కాబట్టి

మీ అమ్మాయిని మా కివ్వండి' అని మనం అంటే వాళ్ళు అంత తేలిగ్గా మన మాట నమ్మరు. అసలు మన మాట వినను కూడ వినరు.

అదీ గాక ఇప్పుడు ఈ రాజీకి పూర్వజన్మ జ్ఞానం వుండదు. కాబట్టి రెండు రోజులలో నాన్నగారు, నేను వెళ్ళి వాళ్ళతో మాట్లాడి, రాజీకి పూర్వజన్మ జ్ఞానం తెప్పించి, నీ దగ్గరకు తీసుకువచ్చి పెళ్ళిచేసే బాధ్యత నాది. అసలు యిప్పుడు రాజీకి పూర్వజన్మ జ్ఞానం తీసుకు రావాలంటే చాలా కష్టం. దానిని గురించి నేను చాలా శ్రమపడాలి. ఇవన్నీ తెలియక నువ్వు తొందరపడితే లాభంలేదు. కాబట్టి నువ్వు రెండుమూడు రోజులు ఓపిక పట్టు'' అని చెప్పాడు.

హరనాథ్ చెప్పిన మాటలు విని ఏదో నిశ్చయానికి వచ్చినవాడిలా ''సరే బాబాయ్! మీరు చెప్పినట్లే చేస్తాను. మీరుమటుకు నా రాజీని తీసుకువచ్చి నాకు అప్పజెప్పాలి.'' అన్నాడు కుమార్.

''అలాగే'' అని ''రమేష్! కాసిని మంచినీళ్ళు ఇవ్వు'' అని అడిగాడు హరనాథ్.

రమేష్ లేచి వెళ్ళి కూజాలో నీళ్ళు గ్లాసులోకి వంపు తున్నాడు. హరనాథ్ జేబులోంచి ఏదో వస్తువు తీసి, రమేష్ మంచం క్రింద మూలగా ఉంచాడు ఎవరికీ కనపడ కుండా.

రమేష్ యిచ్చిన నీళ్ళు త్రాగి మెల్లిగా బయటకు వచ్చాడు హరనాథ్.

9

గోపాలరావు సోఫాలో కూర్చొని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. ఇంతలో ప్రొఫెసర్ హరనాథ్

వచ్చి గోపాలరావుకి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చు న్నాడు.

"మీ దగ్గిర చిన్నప్పుడు రాజీ ఫోటో వున్నదా?"

"ఆఁ! ఉండాలి. చూస్తానుండండి." అని చెప్పి, లోపలికి వెళ్ళాడు గోపాలరావు.

రెండు నిమిషాల తర్వాత చేతిలో ఒక ఫోటోతో తిరిగివచ్చాడు. ఆ ఫోటోని హరనాథ్‌కిస్తూ, "ఈ ఫోటో వల్ల ఉపయోగమేమన్నా వుందా?" అడిగాడు గోపాల రావు.

"ఆఁ! ఈ ఫోటో కొంత ఉపయోగపడుతుంది. మళ్ళీ రేపు తిరిగిస్తాను ఈ ఫోటోను." అని రాజీ ఫోటోను జేబులో పెట్టుకొన్నాడు హరనాథ్.

బయట ఏదో కారు వచ్చి ఆగిన శబ్దం వచ్చింది. చేతిలో బ్రీఫ్‌కేసు పట్టుకొని ఒక యువకుడు లోపలకు వచ్చి ప్రొఫెసర్ హరనాథ్‌ని విష్ చేసాడు.

"ఇతను నా అసిస్టెంట్ కుమార్." పరిచయం చేసాడు హరనాథ్ ఆ నూతన యువకుడ్ని గోపాలరావుకి.

అయిదు నిమిషాల అనంతరం ప్రొఫెసర్ హరనాథ్, కుమార్‌లు కలసి మేడమీద గదిలోకి వచ్చారు.

తను వచ్చిన తరువాత జరిగినదంతా వివరించాడు ప్రొఫెసర్, కుమార్‌తో.

"ముఖ్యంగా నిన్ను పిలిపించింది దేనికంటే యిక్కడ మనకొక 'ఏంటీ' తయారయాడు. ఆ 'ఏంటీ'కి నిన్ను 'ఏంటీ'గా వుండడానికి" అన్నాడు హరనాథ్ నవ్వుతూ.

"ఎవరా ఏంటీ, ఏమా కథా?" ఉత్సాహంగా అడి గాడు కుమార్.

పరంధామయ్య గురించి చెప్పాడు హారనాథ్.

"ఈ రోజు ఉదయం పరంధామయ్య, లిల్లీ యిద్దరూ కలసి ఏదో గుసగుసలాడటం చూసాను. ఈ రాత్రికి ఏదన్నా గొడవ జరుగుతుందని అనుమానంగా వుంది."

"ఏం పరవాలేదు బాస్! నిశ్చింతగా వుండండి. వాడి సంగతి నేను చూసుకుంటాను." అన్నాడు కుమార్.

అంతలో ట్రేతో రెండు మీల్స్ పట్టుకొచ్చాడు నౌకరు.

10

అర్ధరాత్రి 12 గంటల సమయం.

పరంధామయ్య వున్న గది తలుపులు తెరచుకొన్నాయి మెల్లగా. లిల్లీ, పరంధామయ్యలు బయటకు వచ్చారు.

పరంధామయ్య మెయిన్ స్విచ్ వున్న వైపు కదిలాడు. కొద్ది సెకన్లలో కరెంట్ 'ఆఫ్' అయింది. లిల్లీ దగ్గరకు వచ్చి, చెవిలో ఏదో గుసగుసలాడి తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయాడు పరంధామయ్య.

లిల్లీ మెల్లగా మేడ మెట్లవైపు కదలసాగింది. చప్పుడు కాకుండా ఒక్కొక్క మెట్టే ఎక్కి రమేష్ గది ముందు ఆగింది. ఆమె గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. మెల్లిగా ధైర్యంచేసి గది తలుపుమీద చేయి వేసింది. లోపల గడియ వేయలేదు గాబోలు తలుపులు తెరచుకొన్నాయి.

చీరకుచ్చెళ్ళు పైకి లాగిపట్టుకొని నెమ్మదిగా రమేష్ మంచంవైపు నడవసాగింది.

కరెంట్ 'ఆఫ్' అవటంవలన అంతా చీకటిగా వుంది.

రమేష్ గాఢనిద్రలో వున్నాడు. రమేష్ మంచంమీద కూర్చొని మెల్లిగా అతన్ని తట్టి లేపసాగింది. రమేష్

యిటునుంచి తిరిగి అటు పడుకొన్నాడు కాని లేవలేదు.

మెల్లిగా రమేష్‌మీదకు వాలి అతని చెవిలో "రమేష్! లే! నేను రాజీని వచ్చాను." అంది.

ఒక్కసారి ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు రమేష్. అంతా చీకటిగా వున్నది.

"రమేష్! లే! నేను వచ్చాను రాజీని" అంది మళ్ళీ లిల్లీ.

"రాజీ! మళ్ళీ వచ్చావా? ఎందుకు వచ్చావు? మా బాబాయ్ చూసాడంటే కేకలేస్తాడు. వెళ్ళిపో!" అని కంగారుగా అన్నాడు మంచంమీద లేచికూర్చొని.

లిల్లీ కాసేపు సందిగ్ధంలో పడింది, అతనికి ఏం జవాబు చెప్పాలా అని.

"ఇప్పుడు మీ బాబాయి నిద్రపోతున్నాడుగా! తెల్లవారేదాకా మనకు అడ్డులేదు. నిద్రపోతున్నప్పుడు మీ బాబాయికి కాదుగదా, ఆ దేముడికి కూడ తెలియదు, నేను యిక్కడకు వచ్చానని. అయినా నేను తెల్లవారక మునుపే వెళ్ళిపోతాను గదా! ఇంకెందుకు భయం" అని కూర్చొని వున్న రమేష్‌ని తనమీదకు లాక్కొంది లిల్లీ.

రమేష్‌కి అంతా అయోమయంగా వున్నది.

"రాజీ! వదులు. లైటు వేసి వస్తాను" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"వద్దు, రమేష్! చీకట్లోనే చాలా బాగుంటుంది. లైటు వుంటే ఏమీ బాగుండదు." అన్నది లిల్లీ కౌగిలి విడవకుండానే. పిచ్చిగా ఏదో చేయసాగింది రమేష్‌ని.

రమేష్‌లో మెల్లగా కామోద్రేకం బయలుదేరింది.

మెల్లిగా లిల్లీ కౌగిట్లో సర్దుకొని తన రెండు చేతులను లిల్లీ వీపుమీద వేసి గట్టిగా తనవైపు అదుముకోసాగాడు.

రమేష్ ఆవేశం అవధులు లేనంత తీవ్రత కాసాగింది.

రమేష్, లిల్లీమీదకు పూర్తిగా జరిగాడు. చటుక్కున ఆమె చీరకుచ్చెళ్ళను ఊడబెరికాడు.

అప్పటిదాకా కామోద్రేకంలో మరగిపోయిన లిల్లీ ఒక్కసారి విద్యుత్తును తాకినదానిలా పెద్దగా అరచింది.

లిల్లీ అరుపు వినిపించగానే మెయిన్ స్విచ్ దగ్గరకు వెళ్ళి స్విచ్ 'ఆన్' చేసాడు పరంధామయ్య.

లిల్లీ అలాగే పెద్దగా అరుస్తూ కేకలు పెట్టసాగింది.

రమేష్ ఒక్కసారిగా బిత్తరపోయాడు. రాజీ ఎందుకు అట్లా అరుస్తున్నదో అర్థం కావటంలేదు. లిల్లీని గట్టిగా పట్టుకొని—

"రాజీ, ఎందుకలా అరుస్తున్నావు. ఏమయింది" అని కంగారుగా అడుగుతున్నాడు.

"ఛీ, నన్ను వదులు, ఏదో బావవని లోపలకు వస్తే బలవంతం చేస్తావా? ఛీ, ఛీ, నీకంటె గొడ్డు నయం. పశువు కన్నా హీనం అయ్యావు. ఇటువంటివాడివని తెలిస్తే, అసలు యిట్లా చేస్తావని తెలిస్తే నీ గదిలోకి వచ్చేదాన్నే కాదు," అని యింకా ఏమేమో మాట్లాడసాగింది.

రమేష్ అప్పుడు చూసాడు లిల్లీని. అంటే, యిప్పటి దాకా రాజీగా ప్రవరించింది లిల్లీనా? ఆశ్చర్యంతో పాటు ఆవేశంకూడ వచ్చింది రమేష్‌కి.

అప్పటికే గోపాలరావు దంపతులు, పరంధామయ్య, ప్రొఫెసర్ హరనాథ్, కుమార్, అంతా వచ్చేశారు.

"రాక్షసీ, యింత మోసం చేస్తావా? నిన్ను...నిన్ను చంపేస్తాను. నా రాజీ పేరు తలవటానికికూడ అర్హత లేదు. చివరకు యింత నీచానికి దిగజారుతావా?" అని చేయెత్తి లిల్లీని కొట్టబోయాడు.

అంతలో పరంధామయ్య పెద్దగా అరుస్తూ వచ్చి, లిల్లీని ప్రక్కకు లాగి—"ఛీ, ఛీ, నీ కొడుకు యింతటి నీచుడని అనుకోలేదు. ఎంత అన్యాయం చేయబోయాడు. నా చిట్టి తల్లికి. ఏదో బావ యిల్లుగదా అని వస్తే యిదా చేసే మర్యాద. ఇప్పుడు దాని గతేం కావాలి. ఇక దాన్ని ఎవరు పెళ్ళి చేసుకుంటారు" పెద్దగా శోకాలు పెడుతూ అరవసాగాడు.

అందరూ గదిలోకి రాగానే లిల్లీ జారిపోయిన చీరెను కుప్పగా మడచి పట్టుకొని బాత్‌రూమ్‌వైపు పరుగెత్తింది.

తిరిగి పరంధామయ్య గొంతు విజృంభించ సాగింది. గోపాలరావు దంపతులు కంగారు పడిపోతున్నారు. లిల్లీ చీరె సరిగ్గా చేసుకొని వచ్చింది అక్కడికి.

పరంధామయ్య అనే మాటలు వినలేక చెవులు మూసుకుని "పరంధామయ్యా! ఆపుతావా! లేదా! ఇంకొక్క మాట ఎక్కువ మాట్లాడావంటే నాలుక చీరేస్తాను. అయినా అసలు నీ కూతురు మేడమీదకు ఎందుకు వచ్చింది. మేడమీదకు వచ్చినా మావాడి గదిలోకి యెందుకు రావాలి? సిగ్గులేదు. వయసొచ్చిన పిల్ల అర్ధరాత్రిపూట యింకో మగాడి గదిలోకి రావటానికి" అంటూ గోపాలరావు నోరు చేసుకొన్నాడు.

అంతలో లిల్లీ అడ్డం వచ్చి, "నేనేం, మీ కొడుకు గదిలోకి రాలేదు. ఆయనే నా గదిలోకి వచ్చి, "లిల్లీ, కాసేపు నా గదిలో కూర్చొందువుగాని రా. కాసేపు ఏదన్నా మాట్లాడుకొందాం. అసలు నిద్ర పట్టడంలేదు" అని పిలిచాడు. బావే కదా అని నేను వేరే ఏమీ ఆలోచించకుండా వచ్చాను. వచ్చినందుకు తగిన శాస్తిచేసాడు.

ఛీ, ఛీ, పాడు మనుష్యులు - పాడు లోకం. ఇన్నాళ్ళూ వట్టి పిచ్చే అనుకొన్నాను. మదపిచ్చికూడ వుందని తెలియదు. నాన్నా! ఇంక ఒక్క క్షణంకూడ ఈ యింట్లో వుండొద్దు. వెంటనే వెళ్ళిపోదాం పద," అంటూ బయలు దేరబోయింది.

అంతలో కుమార్ అడ్డంవచ్చి, "ఆగండి, లలితాదేవి గారూ! ఇప్పటిదాకా మీ తెలివితేటలు, మీ ఆవేశాలే చూపించారు. కాస్త మా తెలివితేటలుకూడ చూసి ఆ తరువాత మీరు, మీ నాన్నగారు యిక్కడనుంచి నిరభ్యంతరంగా వెళ్ళొచ్చు" అని రమేష్ మంచం క్రింద నుంచి ఏదో వస్తువు బయటకు తీసాడు. అందరూ దాని వంక ఆశ్చర్యంగా చూసారు.

అది 'టేప్ రికార్డర్.'

ఆరోజు ఉదయం హరనాథ, రమేష్ గదిలోకి వచ్చినప్పుడు దానిని అక్కడ పెట్టాడు. అది ఆటోమేటిక్ 'టేప్ రికార్డర్'. బ్యాటరీ సిస్టమ్‌తో పనిచేస్తోంది. అంతే గాక పదిగజాల దూరంలో ఏ శబ్దం వచ్చినా అది టేప్ చేస్తుంది. శబ్దం ఆగిపోగానే టేప్ పనిచేయటంకూడ ఆగిపోతుంది.

కుమార్ టేప్ సెట్ చేసి 'ఆన్' చేసాడు.

అంతకు ముందు ఆ గదిలో రమేష్‌కి, లిల్లీకి జరిగిన సంభాషణ, శృంగారం అంతా స్పష్టంగా విన్పించసాగింది.

అంతా విన్న తరువాత గోపాలరావు ఆవేశంతో కంపించిపోయాడు. అతని పిడికిళ్ళు బిగుసుకొన్నాయి.

"రేయ్, పరంధామయ్యా! ఇందుకా నువు ఇక్కడ చేరింది. ఎంతటి నీచానికి తెగించావు. తక్షణం బయటకు

వడు. లేకపోతే తర్వాత ఏం చేస్తానో నాకే తెలియదు. గెటవుట్!'' పిచ్చిగా అరిచాడు గోపాలరావు.

ప్రొఫెసర్ వంక 'గుర్రు'గా చూసాడు పరంధామయ్య. ఆ చూపులో ఎన్నో భావాలు గోచరించాయి ప్రొఫెసర్ హరనాథ్ కి. తన కూతురుని తీసుకొని విసురుగా బయటికి వెళ్ళిపోయాడు పరంధామయ్య.

రమేష్, ప్రొఫెసర్ వంక కృతజ్ఞతగా చూశాడు.

11

చిక్కటి చీకటిని చీల్చుకుంటూ కారు హెడ్ లైట్ల కాంతిలో అరవై మైళ్ళ వేగంతో దూసుకుపోతున్నది బ్లాక్ అంబాసిడర్.

డ్రైవింగ్ సీట్లో హరనాథ్ కూర్చొన్నాడు. అతని ప్రక్కన గోపాలరావు, అతని భార్య కూర్చొన్నారు.

వెనక సీట్లో కరుణ, కరుణ తల్లితండ్రులు కూర్చొన్నారు.

డ్రైవ్ చేస్తున్న హరనాథ్ ఓసారి వెనక్కి తిరిగి కరుణవైపు చూసి—''కరుణా! ఇంతకు ముందు నేను చెప్పిందంతా గుర్తు పెట్టుకొన్నావు కదా!'' అన్నాడు.

తలకాయ ఆడించింది కరుణ అంతా గుర్తున్నది అన్నట్లుగా.

''ముఖ్యంగా నువ్వు గుర్తు పెట్టుకోవాల్సినవి ఏమిటంటే, చిన్నప్పుడే చనిపోయిన రాజీ అలవాట్లను, పద్ధతులను, నువ్వు ఏమాత్రం మరచిపోకూడదు. అక్కడ అసలు నువ్వు కరుణగా మసలకూడదు. అసలు నువ్వు 'కరుణవి' అన్నమాట పూర్తిగా మరచిపోవాలి. ఇకనుంచి నీ పేరు రాజీ. నీలో కొద్దో గొప్పో చనిపోయిన రాజీ పోలికలున్నాయి. 'రాజీ' అని ఎవరైనా పిలవగానే ఎటువంటి

ఆలస్యం, కంగారు లేకుండా వెంటనే సమాధానం యివ్వాలి.

నేను చెప్పినవి మరచిపోకుండా అక్కడ మసలు కుంటే ఒక మనిషి జీవితం బాగుచేయడమే గాకుండా, ఆ ధనవంతుల యింటి కోడలు అవుతావు. ఏమాత్రం ఏమరుపాటు లేకుండా అప్రమత్తతో మెలగాలి.

ఇకపోతే చిన్నప్పుడు రాజీ, రమేష్‌లు కలసి ఏమేమి ఆటలు ఆడుకొనేవారో, అవి ఎట్లా ఆడుకొనేవారో ఆ వివరాలన్నీ కూడ, గోపాలరావుగారు చెప్పారు నీకు.

"నువు యివన్నీ మరచిపోకుండా రమేష్‌కి, నీకు ఎప్పట్నుంచో, అంటే చిన్నప్పట్నుంచి బాగా పరిచయం, చనువు ఉన్నట్లు ప్రవర్తించాలి. ఇకనుంచి నువు కరుణవు కాదు. రాజేశ్వరివి. అంటే 'రాజీ' వి" అని చెప్పాడు హరనాథ్.

అలాగేనన్నట్లు తల ఊపింది కరుణ.

హరనాథ్ తృప్తిగా నవ్వుకొన్నాడు.

12

"రమేష్, ఇప్పుడు నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఇంకో పావుగంటలో రాజీని తీసుకువచ్చి నీముందుంచు తాను. కాని నువు మటుకు ఆ ఆనందంలో యెటువంటి హడావిడి చేయకూడదు.

పూర్వజన్మలో రాజీ నీతో గడిపింది కొద్దికాలమే. ఆ కొద్దికాలంలో ఆ అమ్మాయి నీతో గడిపినప్పుడు ఉన్న జ్ఞాపకాలు కొన్నిమాత్రమే. అవి అయినా నేను యెంతో కష్టపడి ఆ అమ్మాయికి, అంటే నీ రాజీకి పూర్తి జన్మ స్మృతి తెప్పించాను.

ఇప్పుడు మీ యిద్దరూ కలసి ఒక నెలరోజులుంటే ఇప్పుడున్న నీ రాజీకి అన్నీ గుర్తుకి వచ్చి, చాలా ఆనందం పొందుతుంది. నువు ఆ అమ్మాయిని యెటువంటి కష్టం పెట్టకుండా, యెటువంటి అపనమ్మకం పెట్టుకోకుండా మనస్ఫూర్తిగా స్వీకరించాలి,'' చెప్పాడు హరనాథ్, రమేష్‌కి.

కొద్దిక్షణాలు మౌనం వహించాడు రమేష్, హరనాథ్ చెప్పింది విన్న తరువాత. ''ఇంతకీ మీరు తీసుకొచ్చింది నా రాజీయే అని నాకు నమ్మకమేమిటి?'' అడిగాడు రమేష్ హఠాత్తుగా.

అటువంటి ప్రశ్న రమేష్‌నుంచి వస్తుందని ఊహించిన ప్రొఫెసర్ హరనాథ్, రమేష్ వంక ఒకసారి చూసి, ''నీ రాజీ, ఫోటో ఏదన్నా ఉందా నీ దగ్గర'' అని అడిగాడు.

రమేష్ కుర్చీలోంచి లేచి బీరువాలో భద్రంగా దాచుకున్న ఫోటో నొకదానిని తీసుకువచ్చి హరనాథ్‌కు యిచ్చాడు.

హరనాథ్ తన కోటు జేబులోంచి ఇంకొక ఫోటో తీసాడు బయటకి. ఆ ఫోటో అంతకుముందు గోపాలరావు గారి దగ్గర తీసుకొని, ఫోటో స్టూడియోకి తీసుకెళ్ళి, ఆ ఫోటోను కొన్ని మార్పులతో యింకో ఫోటో తయారు చేయించి పట్టుకొచ్చాడు.

తనదగ్గర ఉన్న ఫోటోను, రమేష్ యిచ్చిన ఫోటోను కలిపి పట్టుకొని రమేష్ ముందు ఉంచాడు.

''చూడు రమేష్! ఇది నువ్విచ్చిన నీ రాజీ ఫోటో. ఈ రెండవది ఈ జన్మలో రాజీ చిన్నప్పటి ఫోటో. రెండు ప్రక్క-ప్రక్కనే పెట్టాను. పరీక్షగా చూడు,

రెండు ఫోటోలలో వున్న అమ్మాయి ఒక్కటే. కాక పోతే నీ రాజీ పువ్వుల గౌను వేసుకుంది. మెడలో సన్నటి గొలుసు వేసుకొంది. చెవులకు రింగులు పెట్టుకొన్నది.

"కానీ ఈ జన్మలో రాజీ ఈ ఫోటోలో సాదా గౌను వేసుకొన్నది. మెడలో గొలుసు లేదు. చెవులకు రింగులు లేవు. ఆ దుస్తులు, ఆభరణాలు దృష్టిలో పెట్టుకోకుండా చూడు. రెండు ఫోటోలు ఒక్కటే."

రమేష్ కొద్దిక్షణాలు పరీక్షగా చూశాడు రెండు ఫోటో లను. తృప్తిగా శ్వాస పీల్చి వదిలాడు రమేష్. అతని మన సంతా ఆనందంగా వున్నది.

"బాబాయ్! మీరు నా పాలిటి దేవుళ్ళు. మీరు చేసిన ఈ మేలుని జన్మజన్మలకు మరచిపోను. మీలాంటి బాబాయి నాకుండటం, అందులోను, ప్రజ్ఞాపాటవాలుగల బాబాయి వుండటం నా అదృష్టం. బాబాయ్! త్వరగా నా రాజీని నాకు చూపించరూ!" అన్నాడు రమేష్ ఆవేశంగా.

హరనాథ్ బయటకు వెళ్ళి రెండు నిమిషాల తరువాత రాజీగా మార్చిన కరుణను తీసుకొచ్చాడు.

"అమ్మా! రాజీ! అడుగో నీ రమేష్! నీకోసం కలవ రించి, కలవరించి పిచ్చివాడిలా తయారయ్యాడు. ఇక నువ్వు వచ్చావు. నీ రమేష్‌ని నువ్వే కంటికి రెప్పలా కాపాడుకోవాలి." అని కరుణకు రమేష్‌ని చూపించాడు.

"రమేష్! ఇదిగో నీ రాజీ. బాగా పరీక్షగా చూడు, చిన్నప్పటి నీ రాజీ పోలికలున్నాయో, లేవో." అన్నాడు హరనాథ్.

"బాబాయ్! నన్ను క్షమించండి. అనవసరంగా మిమ్మల్ని అనుమానించాను. ఈమె తప్పకుండా నా రాజీయే. సందేహంలేదు. ఆ కళ్ళు, ఆ ముక్కు, ఆ పెదాలు,

ఆ తలకట్టు, ఆ రంగు, ఒక్కటేమిటి? అన్నీ నా రాజీ పోలికలే. కాదు నా రాజీయే!" అని గబగబా వచ్చి "రాజీ!" కరుణను కౌగలించుకొన్నాడు.

కరుణకు ఆ క్షణంలో ఆనందం, ఆనందంలో భయం, అంతా కొత్తగా వుంది. తను ఎక్కడ బయటపడతానో నని భయంగా వుంది.

"రమేష్! నేను చెప్పింది అప్పుడే మరచిపోయావా?" అన్నాడు హరనాథ్ మందలిస్తున్నట్లుగా, కరుణ పరిస్థితిని చూసి.

"ఓ! సారీ బాబాయ్! నా రాజీ పెద్దయిన తరువాత స్పష్టంగా చూడటం యిదే మొదటిసారి అవడంవలన ఆ తన్మయత్వంలో నన్ను నేనే మరచిపోయాను. క్షమించండి. ఇంకెప్పుడూ తొందరపడను." అన్నాడు రమేష్ తలవంచుకొని.

"రమేష్! ఇక్కడ రాజీకి అంతా కొత్తగా వుంది. రెండు రోజులపాటు అలవాటయితే అంతా సవ్యంగా వుంటుంది. నువ్వేమటుకు తొందరపడి రాజీని కంగారు పెట్టకు." అని మళ్ళీ "నేను యిప్పుడే వస్తాను. మీరిద్దరూ మాట్లాడుకొంటూ వుండండి." అని చెప్పి బయటకు వచ్చేశాడు.

13

"రాజీ! అలా సిగ్గుపడుతూ అక్కడే నుంచున్నావే! రా! ఇలా వచ్చి కూర్చో." అన్నాడు రమేష్.

కరుణ మెల్లగా కదలివచ్చి, రమేష్‌కి ఎదురుగా కుర్చీలో కూర్చొన్నది.

"రాజీ! నేనంటే నీకు యిష్టంలేదా " మళ్ళీ అన్నాడు రమేష్.

"అదేం మాట రమేష్! నువ్వంటే నాకెంతో యిష్టం. కాదు ఎంతో ప్రేమ. అందుకే నేను చచ్చిపోయినా మళ్ళీ నీకోసం పుట్టి నిన్ను చేరుకున్నాను. ఇంక మళ్ళీ మనిద్దరిని ఆ భగవంతుడు కూడా వేరుచేయడు. ఏనాడో మనం చేసుకొన్న పాపంవల్ల ఈ పదహారేళ్ళు విడివిడిగా బ్రతికాము. ఇప్పట్నించి మనిద్దరికి మంచిరోజులు వచ్చాయి. అందుకనే ఈ రోజు యిలా ఆనందంగా కలుసుకున్నాము." అంది రాజీగా వున్న కరుణ.

"పోనీలే రాజీ! జరిగినదంతా మరచిపో. ఇప్పటికయినా మనిద్దరం ఒకటయ్యాం. రాజీ! నువ్వు ఆ రోజున బావిలో పడగానే, నేను కూడ బావిలో దూకి నిన్ను పైకి తీసుకొద్దామనుకున్నాను. కాని అప్పటికి నేను చిన్న పిల్లాడ్ని. ఈత రాదు. ముసలి పంతులు మన బడిప్రక్కనే వున్న రామయ్యను పిలుచుకొచ్చి బయటకు తీయించాడు నిన్ను.

కాని...కాని అప్పటికే నువ్వు చచ్చిపోయావు. నువ్వు చచ్చిపోయావని తెలిసి నేనెంత ఏడ్చానో తెలుసా. సరిగ్గా పది రోజులు అన్నం కూడ మానేశాను. దాంతో మా అమ్మా, నాన్నావాళ్ళకు చాలా భయం వేసింది. నేను కూడా చచ్చిపోతాననుకున్నారు అంతా. చాలామంది డాక్టర్లకు చూపించారు నన్ను.

ఒక్క సంవత్సరం తర్వాత మళ్ళీ మనిషిగా అయ్యాను. తరువాత పదేళ్ళకు నువ్వు నాకు కనిపించావు. ఆ మాట మా నాన్నకి చెపితే నాకు దయ్యం పట్టిందని భూత వైద్యులను పిలిచి నాకు భూతవైద్యం చేయించాడు. వాళ్లెవరూ నాకు దయ్యాన్ని వదలగొట్టలేకపోయారు. అసలు నిజంగా నాకు దయ్యం పడితే గదా!

నువ్వేమో నాకు కనిపించి మిగతా ఎవ్వరికీ కనుపించవు. నేను ఎప్పుడూ నిన్నే కలవరిస్తూ కూర్చొనేటప్పటికి నాకు పిచ్చిపట్టిందని అనుకొన్నారు అందరూ. ఇంతకాలానికి యిప్పుడు మా బాబాయి ఫారిన్ నుంచి నాకోసం వచ్చి నా బాధను అర్థంచేసుకొని, నిన్ను వెతికి తీసుకొచ్చాడు. నిజంగా మా బాబాయి చాలా మంచివాడు. కాదు దేముడు.'' అని యింకా ఏవేవో చెప్పుకుపోతున్నాడు రమేష్.

'ఊ' కొడుతూ వింటున్నది కరుణ.

రమేష్ చెప్పటం ఆపి, ''నువ్వేం మాట్లాడకుండా అంతా నాచేతనే మాట్లాడిస్తున్నావు. చిన్నప్పుడు గూడ యింతే. నేను పది మాటలు మాట్లాడితే నువ్వు ఒక్క మాట మాట్లాడేదానివి.'' అన్నాడు రమేష్.

''నేనేం మాట్లాడను. అంతా నువ్వే మాట్లాడేస్తున్నావు.'' అంది కరుణ.

''సరే. నేను ఆపేస్తాను. నువ్వు మాట్లాడు. మరచిపోయాను. ఆ రోజు నువ్వు బావిలో పడ్డప్పుడు నీకేమనిపించింది?''

''అమ్మో! అది తలచుకొంటేనే భయం వేస్తుంది.'' అని మళ్ళీ చెప్పసాగింది.

''బకెట్టుతో పాటు నేనుకూడ బావిలో పడ్డాను. పడుతున్నప్పుడు పెద్దగా అరుద్దామనుకున్నాను. కాని గొంతు పెగల్లేదు. నీళ్ళల్లో పడగానే మునిగిపోయాను. కాని ఎవ్వరుకూడ నన్ను బయటకు తీయలేదు. అడుక్కి వెళ్ళిపోయాను. అప్పుడు నాకు ఊపిరి ఆడలేదు. ఊపిరి ఆడక నోరు తెరిచాను. ఒక్కనిమిషంలో నీళ్ళు బాగా లోపలికి వెళ్ళిపోయినాయి. ఆ తరువాత నాకేమీ తెలియలేదు.

అంటే...అం...టే చచ్చిపోయాను.'' ఆ మాట అంటు న్నప్పుడు నిజంగానే ఏడుపు వచ్చింది కరుణకు. ఇక ఆపైన మాట్లాడటానికి వీలులేకుండా గొంతు పూడుకుపోయింది.

''సారీ, రాజీ! జరిగినదంతా గుర్తుచేసి నిన్ను ఏడిపిస్తు న్నాను. అంతా మరచిపో. ఇంకెప్పుడూ జరిగిపోయిన విషయాలను కదిలించను'' అన్నాడు రమేష్ దిక్కు మొగం వేసుకుని.

రమేష్‌కికూడ ఆ సంఘటన జ్ఞాపకమొచ్చి కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

కరుణ పమిటచెంగుతో కళ్ళు తుడుచుకొని, రమేష్ వంక చూసింది. రమేష్ కళ్ళల్లోకూడ నీళ్ళుండటం చూసి, తను కుర్చీలోంచి లేచి రమేష్ కళ్ళు తుడుస్తూ, ''ఏమిటిది రమేష్, నాకు చెప్పి నువుకూడ ఏడుస్తున్నావా?'' అంది.

రమేష్ హృదయం యిప్పుడు తేలికపడింది. ఇప్పుడు చాలా హుషారుగా, ఆనందంగా ఉన్నాడు.

అది చూసి కరుణ తృప్తిగా నిట్టూర్చింది, తన ప్రయ త్నం సఫలీకృతం అయినందుకు.

ఇదంతా చాటుగా గమనిస్తున్న గోపాలరావుకి, గోపాలరావు భార్యకి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

కరుణ, రమేష్ కళ్ళు తుడుస్తున్నప్పుడు అతని కణత మీద ఉన్న గాయాన్ని చూసి, ''రమేష్, ఏమిటిది, చిన్న ప్పుడు జామిచెట్టుమీదనుంచి పడ్డప్పుడు తగిలిన దెబ్బ మచ్చ కదూ!'' అంది. అది గోపాలరావు చెప్పాడు కరు ణకు ఆ మచ్చగురించి.

''అవును రాజీ, ఆ మచ్చ అట్లాగే ఉంది. ఆ మచ్చ

మానిపోలేదు. అంటే ఈ మచ్చగురించి నీకు యింకా జ్ఞాపకం ఉందా?" అన్నాడు రమేష్ ఆశ్చర్యంగా.

"ఈ ఒక్క మచ్చగురించే కాదు. ఇంకా చాలా జ్ఞాపకమున్నాయి," అన్నది కరుణ అమాయకం నటిస్తూ.

గోపాలరావు భార్య సుశీల లోపలకు వచ్చి, "అమ్మాయి రాజీ! అబ్బాయి, నువ్వు భోంచేద్దురుగాని రండి," అని చెప్పి వెళ్ళిపోయింది.

"పద రాజీ, భోంచేసి వద్దాం!" అన్నాడు రమేష్, కరుణచేయి పట్టుకొని కుర్చీలోంచి లేస్తూ.

రమేష్, కరుణ లిద్దరూ బయటకువచ్చి వంట గదివైపు కదిలారు.

14

"రాజీ, సినిమాకి వెడదామా!" అడిగాడు రమేష్.

"ఏ సినిమాకి?" అడిగింది కరుణ నవ్వుతూ.

"జీవనతరంగాలు, చాలా బాగుందిట. మొదటి ఆటకు టిక్కెట్లు తెప్పించాను. సినిమా మొదలవటానికి యింకా గంట టయిముంది. ఈలోపల చక్కగా టాయిలెట్ అయిరా," అని చెప్పి, తనుకూడ లేచి టవల్ తీసుకొని బాత్ రూమ్ వైపు నడిచాడు రమేష్.

గంట తరువాత రమేష్, కరుణలిద్దరూ కలిసి బయటకు వచ్చి కారులో కూర్చొన్నారు.

గోపాలరావు భార్యకు రమేష్, కరుణ జంటగా సినిమాకి వెళ్ళడం చూసి మనస్సు ఆనందంతో ఊగిసలాడింది.

సినిమా చూసి హాలులోంచి బయటకు వస్తూ, "ఎలా ఉంది సినిమా!" అని అడిగాడు రమేష్.

"ఫరవాలేదు," అంది కరుణ.

రమేష్, కరుణ యిద్దరూ కారులో ఎక్కబోతుండగా పరంధామయ్య కనిపించాడు. "ఏరా, సినిమాకి వచ్చావా?" అని ప్రక్కన ఉన్న కరుణని చూసి, "ఈ అమ్మాయి ఎవరు?" అని అడిగాడు ఆశ్చర్యంగా.

రమేష్ ముందు జరిగిన గొడవ ఏమీ పట్టించుకోనట్లుగానే మాట్లాడాడు.

"మామయ్యా! నీకు తెలియదు కదూ! ఈ అమ్మాయి ఎవరో కాదు. చిన్నప్పుడు చచ్చిపోయిన నా రాజీ. మా బాబాయి చాలా కష్టపడి, మళ్ళీ జన్మ ఎత్తిన నా రాజీని కనుక్కొని తీసుకొచ్చాడు. త్వరలో పెళ్ళికూడ చేసుకో బోతున్నాము," అన్నాడు రమేష్.

ఒక్కసారి పరంధామయ్య గుండెల్లో అగ్నిజ్వాలలు రేగినాయి. ఆ అగ్నిజ్వాలలు అతని కళ్ళలోనుండి నిప్పు కణాలుగా రాలుతున్నట్లున్నాయి. అతని ముక్కుపుటాలు ఒక్క క్షణంసేపు అదిరినాయి. అవన్నీ బైటకు కనిపించ నీయకుండా, "రమేష్, నువు నిజంగానే పిచ్చివాడివిరా" అన్నాడు.

"మామయ్యా! ఏం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా?"

"లేకపోతే ఏమిటిరా, చచ్చిపోయినవాళ్ళు మళ్ళీ పుట్టడం అన్నది ఉత్తమాట. మీ బాబాయి నిన్ను మోసం చేసాడు. ఎవర్నో ముక్కు మొగం తెలియనిదాన్ని తీసుకొచ్చి నీకు అంటగట్టి, దానిద్వారా నీ ఆస్థినంతా కాజేయాలని చూస్తున్నాడు. మీ బాబాయి చేసేది అంతా మోసం, మాయ. ఆ మాయలో నువ్వూ, మీ నాన్న చిక్కుకున్నారు.

ఇప్పటికయినా మించిపోయిందేమీ లేదు. దాన్ని వది లేసి, నా లిల్లీని చేసుకో, నాకున్న ఆస్తినికూడ నీకే యిచ్చేస్తాను. నీకోసం లిల్లీ రాత్రింబవళ్ళూ కలవరిస్తుంది. నువు గనక యింకో పెళ్ళి చేసుకొన్నావంటే అది యింత విషం మింగి చస్తుంది" యింకా ఏదో చెప్పబోతున్నాడు పరంధామయ్య.

"మామయ్యా!" ఆవేశంతో పిచ్చిగా అరిచాడు రమేష్, అది రోడ్డు అన్న సంగతికూడ మరచిపోయి.

"ఇంకోసారి నీ మాయకబుర్లు, పిచ్చిమాటలు మాట్లాడా వంటే, నీ నాలుక చీరేస్తాను," బిగ్గరగా అరిచాడు రమేష్.

అప్పటిదాకా పరంధామయ్య అన్న మాటలు విని, అవ మానంతో కుంచించుకుపోయిన కరుణ, "రమేష్, రా, ఇంటికి పోదాం, అనవసరంగా రోడ్డుమీద గొడవ దేనికి?" అంటూ రమేష్‌ను చేయిపట్టి తీసుకెళ్ళి, కారులో కూర్చుంది.

కారు బయలుదేరింది.

కరుణని చూసి, పై కండువాని చేతిలోకి తీసుకొని దాన్ని గట్టిగా దులిపి, మళ్ళీ భుజానవేసుకొని వెళ్ళి పోయాడు పరంధామయ్య కోపంగా.

15

రాత్రి పన్నెండు గంటల సమయం—

ఆ రోజు సాయంత్రం, అంటే...రమేష్, కరుణ ఇద్దరు సినిమాకి వెళ్ళిన తరువాత కుమార్, రమేష్ గదిలోకి వెళ్ళి బ్యాటరీ సెల్స్‌తో పనిచేసే చిన్న మైకుని అమర్చాడు. ఆ మైక్‌కి సంబంధించిన స్పీకర్లను ఒకటి రమేష్ మంచం

దగ్గర, రెండవది బాల్కనీలోను అమర్చాడు. మైక్ 'డూమ్'ని తన గదిలోకి పెట్టుకొన్నాడు.

అంటే రమేష్ గదిలో ఏ చిన్న శబ్దం అయినా అది తమ గదిలోకి వినిపిస్తుంది.

మైక్ లోంచి ఏదో శబ్దాలు వినరాసాగాయి. ప్రొఫెసర్ హరనాథ్ కి అప్పటికే బాగా నిద్ర పట్టింది. కుమార్ కి నిద్ర పట్టక అటూ యిటూ దొర్లసాగాడు.

మైకులోంచి వచ్చే శబ్దాలు విని కుమార్ చెవులు నిక్కబొడుచుకున్నాయి.

రమేష్ గదిలోంచి మైక్ ద్వారా చిన్న చిన్న మూల్గులు వినరాసాగాయి. ఆ మూల్గులలో ఎవరితోనో కలబడుతున్నట్లుగాను, గింజుకున్నట్లుగాను, ఏదో పెద్ద బరువును మోస్తున్నట్లుగాను వినబడసాగాయి కుమార్ కి.

వెంటనే మంచంమీదనుంచి లేచాడు కుమార్.

రమేష్ గదిలోంచి ఏదో క్రింద పడినట్లు శబ్దం అయింది. డ్రాయరు సొరుగులోంచి రివాల్వర్ తీసుకొని, హరనాథ్ ని లేపి, బయటకు పరుగెత్తి రమేష్ గదిదగ్గరకు వచ్చి తలుపులు తోసాడు. కాని తలుపులు తెరచుకోలేదు.

తను తలుపులు తట్టికూడ ప్రయోజనం లేదనుకొని కిటికీలోంచి లోపలకు చూసాడు. అప్పుడే ఏవో ఆకారాలు బాల్కనిలోంచి క్రిందకు దూకడం కనిపించింది. వెంటనే మెట్లమీదనుంచి రివ్వున పరుగెత్తి బయటకు వచ్చాడు.

ఏదో కారు స్టార్టయి మేడ వెనకాలి తోటలోంచి మెయిన్ గేటువైపు రాసాగింది.

చేతిలోని రివాల్వర్ ని పొజిషన్ లో పట్టుకొని, చెట్టు చాటున నక్కాడు కుమార్.

కారు పోర్టికోలో మలుపు తిరిగి గేటువైపు వెళ్ళే సమయంలో కుమార్ గురిచూసి కారు బ్యాక్ టైరును బర్స్టు చేసాడు రివాల్వర్ బుల్లెట్‌తో.

'కీచు' మంటూ ఆగిపోయింది కారు.

రివాల్వర్ ప్రేలిన శబ్దానికి గోపాలరావు తదితరులు బయటకు వచ్చారు.

"అందరూ బుద్ధిగా వచ్చి లొంగిపొండి. లేకపోతే ప్రాణాలు తీయటానికికూడ వెనకాడను," అన్నాడు కుమార్ పెద్దగా, కారులోనివాళ్ళ నుద్దేశించి.

కాని ఎవరూ కారు దిగలేదు.

మరి కొద్దిసేపట్లో పోలీసువ్యాన్ లోపలకు వచ్చి ఆగింది. వానులోంచి ఇన్‌స్పెక్టరు దిగాడు గబాగబా. ఆయన వెనకాలే నలుగురు కాన్‌స్టేబుల్సుకూడ దిగివచ్చారు.

"మీలో హరనాథ్ గారు ఎవరు?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

"నేనే" అంటూ ముందుకు వచ్చాడు ప్రొఫెసర్ హరనాథ్.

"మీరేనా మాకు ఫోను చేసింది," అడిగాడు యిన్‌స్పెక్టర్.

"అవును. నేనే. అదుగోండి ఆ కారులో దాక్కొన్నారు, వెళ్ళి అరెస్టు చేయండి," అన్నాడు కారువైపు చూపిస్తూ.

అప్పటిదాకా కారులో దాక్కొన్న నలుగురు వ్యక్తులను పోలీసులు లాక్కొచ్చారు వెలుతురులోకి.

ఆ నలుగురిలో ఒకతను పరంధామయ్య. మిగతా ముగ్గురు ఆ వూర్లో పేరుమోసిన గూండాలు.

"మెనీ థాంక్స్, ప్రొఫెసర్ జీ! రేపు మీరొకసారి స్టేషన్ కు వచ్చి స్టేట్ మెంటు యిచ్చి వెళ్ళండి," అన్నాడు ఇన్ స్పెక్టర్.

పరంధామయ్యతో సహా మిగతా ముగ్గురకు కూడ అర దండాలు తగిలించి వాన్ లో ఎక్కించుకొన్నారు.

అప్పటిదాకా నోరు వెళ్ళబెట్టుకొని చూస్తోన్న గోపాలరావుకి యిదేమీ అంతుబట్టక అయోమయంలో పడ్డాడు.

ప్రొఫెసర్ హరనాథ్ కారు దగ్గరకు వచ్చి, తలుపు తీసి చూసాడు.

లోపల రమేష్, కరుణ యిద్దరూ స్పృహ లేకుండా పడి ఉన్నారు. వాళ్ళిద్దరినీ ఆ స్థితిలో చూసిన గోపాలరావు, "హరనాథ్ గారూ! ఏమిటిది? వీళ్ళెందుకు యిట్లా పడి ఉన్నారు. అసలు యిందాక గొడవ ఎందుకు జరిగింది?" అడిగాడు కంగారుగా.

"మీరేమి కంగారు పడకండి. వీళ్ళిద్దరికీ క్లోరోఫారం వాసన చూపించి స్పృహ తప్పించారు. మిగతా కథ లోపలకు వెళ్ళిన తరువాత చెప్తాను. ముందు మీరు వెళ్ళి ఫోన్ చేసి, డాక్టర్ని పిలవండి" అన్నాడు.

రమేష్ని, కరుణని కారులోంచి బయటకు తీసి, చేతుల మీద లోపలకు మోసుకెళ్ళారు.

16

ప్రొఫెసర్ హరనాథ్, కుమార్ లు తమ గదిలో కూర్చొని ఏదో మాట్లాడుకుంటున్నారు. అప్పుడు సమయం రాత్రి మూడుగంటలు దాటింది.

గోపాలరావు, డాక్టర్ని పంపించి, మళ్ళీ ప్రొఫెసర్ ఉన్న గదిలోకి వచ్చాడు.

"హరనాథ్ గారూ! పరంధామయ్య చెడ్డవాడని తెలుసుగాని, మరీ యింతటి దుర్మార్గుడని తెలియదు నాకు. అయినా అతను ఎందుకు చేసాడీ పని" అడిగాడు గోపాలరావు.

సిగిరెట్టు వెలిగించుకొని, చెప్పసాగాడు హరనాథ్.

"నేను మొదటిసారి పరంధామయ్యను చూసినప్పుడే అతని మనస్తత్వాన్ని గ్రహించాను. అతను అనుకొన్నది జరగాలి. అది జరగకపోతే బలవంతంగానైనా, బెదిరించిగాని తన పని చేసుకుపోయే రకం.

అతను ఏదో దుర్మార్గపు పని చేస్తాడని నాకు మొదటి నుంచి అనుమానంగానే ఉన్నది. కాని అతను ఎప్పుడు తన పనిచేస్తాడో తెలియదు.

అందుకోసమని రమేష్ గదిలో, బ్యాటరీ సిస్టమ్‌తో పనిచేసే మినీ మైక్ సెట్టును రహస్యంగా పెట్టాను. దాని ద్వారా రమేష్ గదిలో ఏం జరుగుతున్నదో నాకు స్పష్టంగా తెలుస్తుంది.

రమేష్, కరుణ సాయంత్రం మొదటి ఆట "జీవన తరంగాలు" సినిమాకు వెళ్ళారు. ఆ సినిమాకే వచ్చాడు పరంధామయ్యకూడా. రమేష్‌కు, పరంధామయ్యకు చిన్న గొడవ అయింది, మనం తీసుకొచ్చిన రాజీ గురించి.

పరంధామయ్య 'జీవన తరంగాలు' సినిమా చూసిన తరువాత ఒక ప్లాను వేసుకొన్నాడు.

ఆ సినిమాలో యిదేమాదిరిగా హీరోయిన్‌కి, హీరో క్లోరోఫారం వాసన చూపించి, కారులో ఎత్తుకెళ్ళిపోయి ఒకచోట పెండ్లి ఏర్పాట్లు చేయించి, హీరోయిన్‌ని స్పృహలేని సమయంలో తనతోపాటు పెండ్లి పీటలమీద

కూర్చోపెట్టుకొని, తాళి కట్టేస్తాడు. తాళి కట్టేటప్పుడు ఫోటో తీయిస్తాడు.

అదేవిధంగా యిప్పుడు రమేష్‌చేత లిల్లీకి తాళి కట్టిస్తే ఆ సమయంలో ఫోటో తీయించి, ఆ ఫోటో తీసుకొని కోర్టుకు వెళ్ళి, నీ కొడుకుని అల్లుడిగా చేసుకొందామని ప్లాను వేసాడు. ఆ తరువాత అతనిద్వారా మీ ఆస్తిని కాజేయవచ్చు.

కాని యిక్కడ మేము చేసిన ఏర్పాట్లు అతనికి తెలియవు. సరాసరి వచ్చి బోనులో పడ్డాడు.

నిజంగా పరంధామయ్య తెలివితక్కువవాడు. అతన్ని చూస్తే నాకు జాలివేస్తుంది. అతనికి ముందుచూపే గాని, వెనకచూపు లేదు'' అని చెప్పటం ముగించాడు ప్రొఫెసర్ హరనాథ్.

అంతా విని ఆశ్చర్యపోయాడు గోపాలరావు.

''ఇకపోతే నేను వచ్చిన పని అయింది. రేపే నేను విజయవాడ వెళ్తాను. నేను వెళ్ళేముందు మీకు కొన్ని విషయాలు చెప్పాలి,'' అన్నాడు ప్రొఫెసర్.

''చెప్పండి.''

''మీరు సాధ్యమయినంత త్వరలో, కరుణకు, రమేష్‌కి పెళ్ళిచేసి, ఆ తరువాత మీరందరూ యిక్కడనుంచి మకాం మార్చేసి ఏ దూరపు ప్రదేశమో వెళ్ళిపోయి, అక్కడ కాలం గడపండి.''

''అదే మీరు గనక ఇక్కడ ఉన్నట్లయితే యెప్పటి కయినా కొన్ని చీడపురుగులు, అతని మెదడు తొలచి, రాజీ నకిలీ జన్మను గురించి బయటపెడతాయి. అదే జరిగితే రమేష్ మళ్ళీ మీకు దక్కడు. కాబట్టి నేను చెప్పింది చేయండి, సాధ్యమయినంత త్వరలో.''

"అలాగే, మీరు చెప్పినట్లే చేస్తాను. మాకున్నది వా డొక్కడే కొడుకు, వాడి బాగు గురించి, ఎక్కడికైనా, ఎంతదూరం అయినా పోతాను" అన్నాడు గోపాలరావు.

"ఇక్కడ యిక నా పని అయిపోయింది కాబట్టి, నేను, కుమార్ రేపు ఉదయమే ప్రయాణమవుతాము. దయచేసి మా ప్రయాణానికి ఏర్పాట్లు చేయండి," అన్నాడు ప్రొఫెసర్ హరనాథ్.

"మీకు ఏ విధంగా కృతజ్ఞతలు చెప్పుకోవాలో నాకు అర్థం కావటం లేదు. నా కొడుకుని బాగుచేయడమే గాకుండా, వాడ్ని పెద్ద ఆపదనుంచి కాపాడారు. మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను" అంటూ ఆనంద బాష్పాలు రాల్చాడు గోపాలరావు.

"ఇందులో నన్ను పొగడాల్సింది ఏమీ లేదు. నా కర్తవ్యం నేను నిర్వహించాను. 'గుడ్ నైట్'. ఇక వెళ్ళి పడుకోండి. రేపు ఉదయం కలుద్దాం," అంటూ బెడ్ మీదకు వాలాడు ప్రొఫెసర్ హరనాథ్.

—:ఐపోయింది:—